క్లుప్తంగా

రేపు మండల సమావేశం

బిక్కవోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ సాధారణ సమావేశం నిర్వహించున్నట్టు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతను జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదకతో తప్పక రావాలన్నాని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న రాంబాబు

రాజానగరం: వ్యాపార పరంగా డీలర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మండల ఎరువులు, పురుగుల మందుల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సముద్రాల రాంబాబు అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఎన్నికలో మండలంలోని 27 మంది డీలర్లు పాల్గొనగా 9 ఓట్ల మెజార్టీతో రాంబాబు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మద్దుల గిరిబాబు ఓటమి పొందారు.

ఘనంగా అనఘాష్టమి వ్రత మహోత్సవం



దత్త పీఠంలో వ్రతం ఆచరిస్తున్న భక్తులు

అనపర్తి: స్థానిక ఆర్కే ఎగ్ గోడౌన్‌లో వెలసిన ఔదంబర దత్త పీఠంలో ఆదివారం భక్తులు అనఘాష్టమి వ్రతం ఘనంగా నిర్వహించారు. హోమియో వైద్య నిపుణులు డాక్టర్ మల్లిడి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా అర్చకులు బాలాజీశర్మ భక్తులతో వ్రతం చేయించగా అనఘా దత్త రక్ష మంత్ర హోమాన్ని అర్చకుడు బీహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కోరుకొండ: జంబుపట్నం గ్రామంలో పేకాట శిబిరంపై సీఐ సత్యకిషోర్, ఎస్సై నాగార్జున ఆదివారం దాడి చేసి, ఐదుగురు నిందుతులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.16,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సత్య కిషోర్ విలేకరులతో మాట్లాడుతూ పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రశాంతమైన పల్లెల్లో పేకాట కారణంగా వివాదాలు తలెత్తుతున్నాయని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరుకు చెందిన మోర్త సూరిబాబు(40) ఆదివారం ఉదయం పాల ప్యాకెట్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. నడచి వెళ్తున్న అతనిని బైక్ వేగంగా వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయమైంది. వెంటనే అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. దీనిపై నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న స్థానిక ఎస్సై ప్రియకుమార్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

రాజానగరం: నరేంద్రపురానికి చెందిన దాకారపు సీతారమయ్య పాలచర్ల శివారులోని గోదావరి టౌన్ షిప్ వద్ద ఉన్న వేప చెట్టుకు పంచెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యం అలవాటు ఉన్న అతను ఇంటిలో వాళ్లను బెదిరిస్తూ రెండు, మూడు సార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి ఒకటీ రెండు రోజుల తరువాత తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీన ఉదయం 7 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. ఎక్కడికో వెళ్లి ఉంటాడు, వస్తాడులే అని కుటుంబ సభ్యులు ఊరుకున్నారు. ఈ మేరకు మృతుని కుమారుడు వీరమణికంఠ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై ఎస్. ప్రియకుమార్ తెలిపారు.

సండే ఆన్ సైకిల్

కంబాలచెరువు: ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'సండే ఆన్ సైకిల్' ర్యాలీ ఆదివారం నగరంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది శారీరక దృఢత్వం, ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించారు. దీనికి ఏఎస్పీలు యంబీఎన్.మురళీకృష్ణ, ఎల్.చెంచిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైక్లింగ్ ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకొనే విధంగా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుతం మనమందరి జీవన శైలిలో ప్రతిరోజూ ఎక్కువగా మోటార్ సైకిల్స్, కార్లలో ప్రయాణిస్తున్నామని, ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ, శారీరక చురుకుదనం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో అధికారులు వారి సిబ్బంది, ప్రజలతో కలిసి ఫిట్ ఇండియా సైకిల్ ఆన్ సండే ర్యాలీ నిర్వహించాలన్నారు. ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కూరుకుపోయిన కల్వర్టులు



రాజానగరం సినిమా థియేటర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



టెలిఫోన్ ఎక్ఛేంజ్ వద్ద కూరుకుపోయిన కల్వర్టు

- రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు
- ఛిద్రమవుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు

రాజానగరం: అసలే రోడ్ల నాణ్యత అంతంత మాత్రంగా ఉంది. అపై వర్షం నీరు దిగువకు పోయే మార్గం లేక రోడ్ల పైనే నిలిచిపోతుంది. ఈ క్రమంలో రోడ్లు చాలా వరకు పాడైపోయి, గుంతలు పడుతున్నాయి. ఈ గుంతలు పడిన రోడ్లపై ప్రయాణించడానికి జనం హడలిపోతున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలోని పూర్వపు జాతీయ రహదారిగా ఉన్న రోడ్డు నేడు మురికి కాలువగా దర్శనమిస్తోంది. రోడ్డంతా ఇలాగే ఉందని కాదుగానీ స్థానిక టెలిఫోన్ ఎక్ఛేంజ్ నుంచి సినిమా హాలు వరకు, మసీదు నుంచి నూకాలమ్మ గుడి వరకకు ఇదే పరిస్థితి. దీనికితోడు వర్షాలు కురిస్తే ఇక ఆ ప్రాంతమంతా వరదను తలపిస్తోంది. అయినా సంబంధిత అధికారులకు, పాలకులకు మాత్రం ఇది ఒక సమస్యగా కనిపించడంలేదు.

కూరుకుపోయిన కల్వర్టులు

గ్రామంలో ప్రధాన రహదారిలో వేసిన కల్వర్టులు కూరుకుపోవడంతో ముంపు నీరు దిగువకు పోవడంలేదు. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గత ఏడాది ఈ కల్వర్టుల స్థానే కొత్త వాటిని నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ నుంచి నిధులు మంజూరైనా గానీ అవి దుర్వినియోగమయ్యాయి. కూరుకుపోయిన కల్వర్టులను వదిలేసి, రియలిస్టేట్ వ్యాపారులకు ప్రయోజనం చేకూరే విధంగా అవసరం లేని చోట నూతనంగా కల్వర్టులను నిర్మించారనే విమర్శలు ఉన్నాయి. అదే కూరుకుపోయిన కల్వర్టుల స్థానే కొత్త వాటిని నిర్మించి ఉంటే ఈ సమస్యలొచ్చేవి కావని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో పాత ఎస్‌హెచ్‌పై టెలిఫోన్ ఎక్ఛేంజ్, సినిమా థియేటర్, జెడ్పీ బంగ్లా, మసీదు ప్రాంతాలలో పూర్వం తూరలతో వేసిన కల్వర్టులు కూరుకుపోయాయి. వీటితోపాటే నూకాలమ్మ గుడి వద్ద వేసిన తూరలను తొలగించి, కొత్తవి నిర్మించారు. ఆ సమయంలోనే సినిమా థియేటర్ వద్ద కూడా కల్వర్టు నిర్మించే ప్రయత్నం చేశారు కానీ ఎగువ ప్రాంతంలో ముంపు ఏరియాలో ఓ బడా వ్యక్తి వేసిన లేఅవుట్ నుంచి ముంపు నీరు దిగువకు పోయేలా కొత్తగా తూరలతో కల్వర్టును నిర్మించారు. దీంతో టెలిఫోన్ ఎక్ఛేంజ్ నుంచి సినిమా హాలు వరకు నివాసం ఉంటున్న వారు వాడే మురుగునీరు కూడా రోడ్డు పైకి చేరి రోడ్డు పాడైపోతోంది.

రోడ్లు పాడవుతున్నాయి

గ్రామంలోని పాత ఎస్‌హెచ్‌పై పూర్వం తూరలతో వేసిన కల్వర్టులన్నీ కూరుకుపోయాయి. వాటిని పునరుద్ధరించవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం కొన్ని చోట్ల రోడ్డు పాడైపోయి, మురుగునీరు ప్రవహించడానికి గల కారణాలు ఏమిటనే విషయాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి.

– పయ్యావుల వీరవెంకట్రావు, సూర్యారావుపేట

గాలికొదిలేశారు

సూర్యారావుపేట వద్ద వేసిన లేఅవుట్ కోసం ఆ ప్రాంతంలో లేని కల్వర్టును నిర్మించారు. కూరుకుపోయిన కల్వర్టులను గాలికొదిలేశారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవాలి. పాత ఎస్‌హెచ్ రోడ్డు పాడైన చోట అందుకు గల కారణాలను పరిశీలించి, కూరుకుపోయిన కల్వర్టుల స్థానే కొత్త వాటిని నిర్మించాలి.

– బుద్దాల త్రిమూర్తులు, శ్రీరామనగర్

గ్రామాల్లో అన్నసమారాధనలు



అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



దొడ్డిగుంట అన్నప్రసాదం స్వీకరిస్తున్న మహిళలు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని మార్కెట్ సెంటర్‌లో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి ముగింపును పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన అన్నదానానికి గ్రామస్తులతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు వచ్చి అన్నసమారాధన కార్యక్రమంలోని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోని ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్నం వీరభద్రారెడ్డి, కమిటీ సభ్యులు ద్వారంపూడి వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి, మల్లిడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

బాలగణపతి ఆలయం వద్ద..

రంగంపేట: దొడ్డిగుంట గ్రామంలోని బాల గణపతి ఆలయం వద్ద ఆదివారం అన్నదానం జరిగింది.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామస్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. బాల గణపతి ఆలయ కమిటీ చైర్మన్ వెలమర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, చోడాబత్తుల రాంబాబు, లకమన కొండయ్య, అడబాల మరిడయ్యకాపు, అడబాల బుల్లిరాజు, పంజా గణేష్, బూరయ్య పాల్గొన్నారు.

చినకొండేపూడిలో..

సీతానగరం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం చినకొండేపూడిలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామస్తులు సుమారు 5 వేలకు పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ముందుగా స్వామివారికి పూజలు చేశారు.

కొమరిపాలెం రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



కొమరిపాలెం రెడ్డి సంక్షేమ సంఘం నూతన సభ్యులు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని కొమరిపాలెం రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ సంఘం గౌరవ అధ్యక్షులుగా కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులుగా మల్లిడి సూరారెడ్డి, అధ్యక్షుడిగా ద్వారంపూడి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మండ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొవ్వూరి వెంకటరామిరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సుధాకర్‌రెడ్డి, కర్రి సత్యనారాయణ రెడ్డి 50 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, వైద్యులు జీఎస్ఎన్‌రెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, పారిశ్రామిక వేత్తలు కొవ్వూరి పాపరెడ్డి, కర్ర ముకందారెడ్డి, కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, కోశాధికారి మల్లిడి సూరారెడ్డి, యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ఏర్పాటు చేసిన సంఘం ఏవిధంగా ముందుగా వెళ్లాలి, సంక్షేమలో ఎలాంటి పాత్ర ఉండాలని సూచించారు. సంఘంలో ఉన్న పేదలకు మరింత సహాయం అందించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే మిగిలిన ప్రముఖులు మాట్లాడుతూ సంఘం ఉన్నత స్థానం ఉండాలన్నారు. ఇతర సంఘాలకు కొమరిపాలెం రెడ్డి సంక్షేమ సంఘం ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలోని 50 మంది సభ్యులు ఘనంగా సత్కరించారు. అలాగే సంఘం సభ్యులు కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డిని ఘనంగా సత్కరించారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ప్రతిభ



మొదటి స్థానం సాధించిన బాలుర జట్టు



తృతయ స్థానం సాధించిన బాలికల జట్టు

బిక్కవోలు: ఆంధ్రప్రదేశ్ పదో జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు అనంతరపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో రామాపురం గ్రామంలో నిర్వహించారు. ఈ పోటీలు గత మూడు రోజులుగా ఎంతో హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ విభాగంగా తూర్పుగోదావరి జిల్లా బాలురు జట్టు చిత్తూరు జిల్లాపై విజయం సాధించి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. అలాగే బాలికలు శ్రీకాకుళం జట్టు పై తలపడి మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వీరిని ముప్పన క్లబ్ ప్రెసిడెంట్ స్వామి, కార్యదర్శి ముప్పన సీతాపతిరావు, ముప్పన వీర్రాజు, పీఈటీజే మోహన్ రావు పలువురు అభినందించారు.

రంగంపేటలో సినిమా తీస్తే హిట్టే..

- ప్రముఖ సినీ విశ్లేమకుడు అడబాల మరిడయ్యకాపు
- నేడు సినిమా దినోత్సవం



అడబాల మరిడయ్యకాపు సినీ విశ్లేషకుడు

రంగంపేట: మెట్టప్రాంత మండలమైన రంగంపేటలో సినిమా షూటింగ్ చేస్తే ఆ సినిమా విజయం సాధిస్తుందని అనడంలో సందేహం లేదని ప్రముఖ సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్యకాపు అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ 1931 సెప్టెంబర్ 15న భక్తప్రహ్లాద సినిమా విడుదలయ్యిందని ఆ రోజునే సినిమా దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు రంగంపేటలో సింధూరం, బాలరాజు బంగారు పెళ్ళాం, మనసిచ్చిచూడు, హనుమాన్ జంక్షన్, ఇంగ్లిషు పెళ్ళాం-ఈస్ట్‌గోదావరి మొగుడు, అందాల రాముడు, యర్రబాబు తరదిత సినిమాలు షూంటింగ్‌లు జరిగాయని, అవి విజయం సాధించాయన్నారు. ఇక్కడ పురాతన ఇళ్లు, దేవాలయాలు, చెరువులు, పొలాలు సినిమా షూటింగ్‌లకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. అదేవిధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పటి వరకు 900 సినిమాలు అవుట్‌డోర్ షూటింగ్‌లు జరుపుకొన్నాయన్నారు. మొదటి సారిగా 1963లో ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో మూగమనసులు సినిమా షూటింగ్ జిల్లాలో జరుపుకోగా అప్పటి నుంచి ఈ జిల్లా అవుట్‌డోర్ సినిమా షూటింగ్‌లకు ప్రసిద్ధి చెందిందన్నారు.

వృద్ధుల పింఛన్ల కోసం రూ.25 వేల విరాళం

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ 14 సంవత్సరాలుగా వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న సంగతి తెలుసుకుని ఆదివారం క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబుకి స్థానిక భవ్య స్కిన్ క్లినిక్ అధినేత డాక్టర్ పలివెల హరనాథ్ రూ.25వేల విరాళం అందించారు. క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, కో- ఆర్డినేటర్స్ గోసాల బాపూజీ, బొల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులతో అవస్థలు



చంద్రేడు గ్రామంలో ఇంటి వద్దే తిష్టవేసిన కోతులు



మర్రిపూడి గ్రామంలో వీధిలో సంచరిస్తున్న కుక్కలు

రంగంపేట: మండలంలో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. అవి గుంపులుగా జనంపై దాడికి దిగుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు రావాలన్నా, పోవాలన్నా కుక్కలు, కోతులు దాడి చేస్తాయని బెదిరిపోతున్నారు. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో వీధుల్లో తిరుగుతూ ప్రజలపైకి దూకుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు నివాస ప్రాంతాలకు వచ్చి గృహాలను గుల్ల చేస్తున్నాయి. ఒక వైపు కోతుల బెడద అయితే మరొక వైపు కుక్కల గుంపులు తోడైయ్యాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో కుక్కల దాడితో గాయాలు పాలైన ఘటనలు ఉన్నాయి. ఈ రెండు జంతువుల ఆగడాలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితులు వచ్చాయి. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో కోతులను, కుక్కలను పట్టుకునేవారు. వాటిని పట్టుకెళ్లినా మళ్లీ వస్తున్నాయి. అధికారులు స్పందించి కోతులు, కుక్కలను పట్టుకొని అటవీ ప్రాంతాల్లో వదిలేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ గ్రంథాన్ని జ్యోతిష్య పాఠ్యాంశాల్లో చేర్చాలి



సూర్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న అభిమానులు

సీటీఆర్ఐ: ఉపద్రష్ట సూర్యనారాయణమూర్తి పరిశోధించి రచించిన నామ నక్షత్ర వివేచన గ్రంథాన్ని జ్యోతిష్య పాఠ్యాంశాల్లో చేర్చాలని జ్యోతిష్య పండితులు ప్రభుత్వానికి సూచించారు. 35 ఏళ్ల కృషితో నామ నక్షత్రాలను విశ్లేషిస్తూ రచించిన గ్రంథ పరిచయం స్వాతంత్ర సమరయోధులు పార్కులో ఆదివారం జరిగింది. విశ్రాంత అధ్యాపకులు హెచ్.ఎస్.ఎం కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జ్యోతిష్య పండితులు పాల్గొన్నారు. ఈ పుస్తకంలో రచయిత తెలిపిన విషయాలు, ఇంతకముందు ఎక్కడా ప్రచురితం కాలేదన్నారు. జన్మ నక్షత్రానికి, నామ నక్షత్రానికి సంబంధం లేదని ఈ పుస్తకం వెల్లడించిందన్నారు. కంచి కామకోటి పీఠాధిపతుల మన్ననలు పొందిన ఈ పుస్తకాన్ని, జ్యోతిష్య పండితులు ముహూర్తాలు పెట్టే పురోహితులు ఉపయోగించుకోవచ్చని పలువురు పండితులు వెల్లడించారు. పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్య శాస్త్రి, ఎక్కిరాల రామకృష్ణ, డాక్టర్ దీక్షితుల రామకృష్ణ, పొన్నా సుబ్రహ్మణ్యం సిద్ధాంతి, రేమేళ్ళ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ పుస్తక పరిచయ కార్యక్రమంలో కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ , దేశిరెడ్డి బలరామనాయుడు, దుర్వాసన సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా పాల్గొన్నారు. రచయిత గ్రంథకర్త సూర్యనారాయణ మూర్తిని జ్యోతిష్య అభిమానులు సత్కరించారు.

తెలుగు పాటకు ప్రపంచ ఖ్యాతిని తెచ్చిన ఎస్పీ బాలు

ధవళేశ్వరం: తెలుగు పాటకు ప్రపంచ ఖ్యాతిని తీసుకువచ్చిన మహనీయుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. రాకా కల్చరల్ అసోసియేషన్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని సన్మానించారు. గాలి సుబ్బరాజు ఫౌండేషన్ చైర్మన్ గాలి సుబ్బరాజు ,రాకా ప్రధాన కార్యదర్శి జీవి రమణ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు పాల్గొన్నారు.

నిరంతరం మద్యం సరఫరా

- ప్రతి పేటలో బెల్ట్ షాపులు
- ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదులు చేసినా చర్యలు లేవు
- మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నియోజకవర్గంలో తాగునీరు లభించని ఊరు ఉందేమో కాని మద్యం దొరకని ఊరు మాత్రం లేదని, ప్రతి గ్రామంలోను ఇరవై నాలుగు గంటలు మద్యం లభిస్తుందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విచ్చలవిడిగా మద్యం లభిస్తుండడంతో పెద్ద వాళ్లే కాకుండా యువకులు, పిల్లలు కూడా మద్యానికి బానిసలై ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మద్యానికి డబ్బులు లేక దొంగతనాలు, దాడులకు తెగబడుతూ వారిలో నేర ప్రవృతి పెరిగిపోతున్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు గాని కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. అధికారికంగా అనుమతి ఇచ్చిన వైన్ షాపులు ఉన్నా అనధికారికంగా బెల్ట్ షాపులు ప్రతి ఊరిలోనూ వెలసి మద్యం మాఫియా రాజ్యమేలుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం పై పలుమార్లు మండలాల వారీగా బెల్టుషాపుల వివరాలు తెలుపుతూ మీడియా ముఖంగా జాబితాలను విడుదల చేసినా స్థానిక ఎమ్మెల్యేకు గాని అధికారగణంలో గాని కనీస స్పందన లేదని స్వయంగా తాను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశానని అయినా అధికారుల్లో ఎటువంటి కదలిక లేదన్నారు. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాజకీయ శక్తుల అండదండలతోనే ఈ వ్యవహారమంతా జరుగుతుందని భావించాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అండదండలతోనే అధికారులు మౌనం వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ఎదుట, పాఠశాలల పక్కనే బెల్ట్ షాపులు నడపడంపై మాజీ శాసనసభ్యులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకి నిజాయితీ ఉంటే వెంటనే బెల్ట్ షాపులు మూసేయించాలని మాజీ ఆయన డిమాండ్ చేశారు.

ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు రేపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అడ్వాన్స్‌డ్ ఆర్గానిక్ సింథసిస్ అండ్ ఫార్మాస్యూటికల్స్ ఇన్నోవేషన్ ఫర్ ఏ సూటబుల్ ఫ్యూచర్ అనే సదస్సు నిర్వహించునున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కే, రసాయశాస్త్ర కన్వీనర్ టి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సెమినార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్‌లో హైబ్రిడ్ మోడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్)లో జరుగుతుందన్నారు. దేశీయ, విదేశీ విశ్వవిద్యాలయాల ప్రముఖ శాస్త్రవేత్తలు ఆర్గానిక్ సింథసిస్, ఔషధ ఆవిష్కరణలు, డ్రగ్ డిస్కవరీ, బయోటెక్నాలజీ, గ్రీన్ కెమిస్ట్రీ వంటి విభాగాల్లో తాజా పరిశోధనలపై ప్రసంగించనున్నారన్నారు. ఇది విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, అధ్యాపకులకు కొత్త ఆలోచనలు పంచుకుని, పరిశోధనలో సుస్థిరమైన మార్గదర్శకాలను తెలుసుకునే గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. పరిశోధకులు తమ పత్రాలను సమర్పించి ఓరల్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో పాల్గొనవచ్చన్నారు.

పడాల ప్రసాద్‌కు గిరిజాల పరామర్శ



పడాల సావిత్రికి నివాళులర్పిస్తున్న గిరిజాల వీర్రాజు(బాబు)

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు పడాల ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల నరసింహారావులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు(బాబు) పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన వారి మాతృమూర్తి పడాల సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, సర్కార్‌బాషా, పున్నమరాజు వీర్రాజు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన వైఎస్సార్ మున్సిపల్ వింగ్

కంబాలచెరువు: వైఎస్సార్ మున్సిపల్ వింగ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జగన్ హయాంలో మెడికల్ కాలేజీలు ప్రారంభం కాలేదంటూ లేనిపోని అజ్ఞానంతో టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలన్నారు. మెడికల్ కాలేజీని 2021లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ మార్గాన్ని భరత్‌రామ్ ప్రారంభించారన్నారు. అక్కడ మూడు సంవత్సరాలుగా క్లాసులు జరుగుతున్నాయన్నారు. కళ్ల ఎదుట అన్ని కనబడుతున్నా టీడీపీ నాయకులు కాలేజీ బయట ఉన్న చెత్తను చూపిస్తూ అసలు నిర్మాణమే జరగడం లేదు అనడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ముప్పన శ్రీనివాస్, గేడి అన్నపూర్ణం రాజు, దుంపా సురేష్, సాయి పాల్గొన్నారు.